తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, రమణ, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద, కాలేరు వెంకటేశ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న తదితరులు

బీసీల కోసం బీఆర్ఎస్

- సమగ్రకుల గణన వెంటనే చేపట్టాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలి
- బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాల్సిందే
- వచ్చే బడ్జెట్‌లో 30 వేల కోట్లు కేటాయించాలి
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుచేయాలి
- నవంబర్ 10లోపు చేయకుంటే పోరాటం
- బీసీ నేతలతో తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కదిలింది. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి వచ్చే నవంబర్ 10 నాటికి ఏడాది అవుతుంది. ఆలోగా బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రకటించింది. సమగ్ర కుల గణనను వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు హామీ ఇచ్చిన విధంగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేతారకరామారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సమగ్ర కుల గణన పెద్ద కష్టమేమీ కాదని, గతంలో కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే ఒకే రోజులో చేశారని ఆయన గుర్తు చేశారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ. 25-30వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీసీ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, తెలంగాణ సర్పంచ్‌ల సంఘం, తెలంగాణ ఎంపీటీసీ జిల్లా సంఘం అధ్యక్షులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మూడు గంటలకు పైగా సమావేశం కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు ఇచ్చిన హామీలు, వాటి అమలుకు ప్రభుత్వంపై ఏ విధంగా ఒత్తిడి తేవాలనే దానిపై చర్చించారు. సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయాలను కేటీఆర్ తెలుసుకున్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేటీఆర్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నిరుడు నవంబర్ 10న కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట బీసీలను కాంగ్రెస్ మోసం, దగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని బీఆర్ఎస్ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బలహీన వర్గాల పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటాడుతామని, నిలదీస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలు చేసే దాకా వదిలిపెట్టేది లేదన్నారు.

వచ్చే బడ్జెట్‌లో 30వేల కోట్లు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీని నవంబర్ 10లోగా నెరవేర్చకుంటే పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు ఐదేండ్లలోపు లక్ష కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 8 వేల కోట్ల రూపాయలు మాత్రమే పెట్టి బీసీలను మోసం చేసిందని విమర్శించారు. మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా బీసీ సబ్‌ప్లాన్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంబీసీల కోసం ప్రత్యేకంగా మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారని, ఆ మాటకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. క్యాబినెట్‌లో బీసీ మంత్రులు ఇద్దరు మాత్రమే ఉన్నారని, వారికి మరిన్ని మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 22 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేప పిల్లల పంపిణీ ఆపేసి ముదిరాజ్‌లు, గంగపుత్రులకు ప్రభుత్వం అన్యాయం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి రూ.30వేల కోట్ల సంపదను సృష్టించిందని గుర్తుచేశారు. బలహీనవర్గాల కోసం ఏర్పాటుచేసిన గురుకుల విద్యాసంస్థల్లో ప్రమాణాలు దిగజార్చి వారి విద్యా వికాశాలను దెబ్బకొడుతున్నదని విమర్శించారు.

కుంటి సాకులు చెబుతున్నారు

ఒకప్పుడు ఇదే గాంధీ, ఉస్మానియా దవాఖానలు కరోనా సమయంలో వేలాదిమంది ప్రాణాలను కాపాడాయని కేటీఆర్ గుర్తు చేశారు. ఒకే నెలలో 48 మంది పిల్లలు, 14 మంది బాలింతలు ఒక్క దవాఖానలోనే మరణించిన విషయం వాస్తవం కాదా? అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ సమస్యను సరి చేయాల్సింది పోయి కుంటి సాకులు చెప్పడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైరల్ జ్వరాలు, డెంగ్యూ విజృంభిస్తున్న నేపథ్యంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శాసనమండలి బీఆర్ఎస్ పక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, ఎల్ రమణ, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంబీపూర్,రాజు, మాజీ ఎమ్మెల్యేలు సురేందర్, అంజయ్యగౌడ్, నోముల భగత్, భిక్షమయ్య గౌడ్, కర్నె ప్రభాకర్, నరేందర్, పల్లె రవికుమార్, దాసోజు శ్రవణ్, గట్టు రాంచందర్‌రావు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాకేశ్‌కుమార్, అంజనేయులు, బాల రాజుయాదవ్, రాజారాంయాదవ్ పాల్గొన్నారు.

బీసీలకు అత్యధిక సీట్లు

గతంలో చట్టసభల్లో బీసీలకు అత్యధిక సీట్లను బీఆర్ఎస్ ఇచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు. 2014, 2018, 2023 ఎన్నికల్లోనూ, తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికల్లోనూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కన్నా ఎక్కువ సీట్లను బలహీన వర్గాలకు కేటాయించిందని పేర్కొన్నారు. గతంలో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపామని, ఇటీవల బీఆర్ఎస్‌కు ఒక రాజ్యసభ స్థానం వస్తే దానిని కూడా బీసీలకు కేటాయించామని పేర్కొన్నారు. 50 మంది కార్పొరేషన్ చైర్మన్లను నియమిస్తే వారిలో 27 మంది బీసీ బిడ్డలకు అవకాశం ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు పెద్దదిక్కుగా కేసీఆర్ ఉంటారని తెలిపారు. సమగ్ర కులగణనకు సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వర్కింగ్ గ్రూపులుగా క్షేత్ర స్థాయిలోకి..

తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్‌లు ఏ విధంగా అమలవుతుందో తెలుసుకోవడానికి శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో ఒక బృందం అక్కడ పర్యటిస్తుందని కేటీఆర్ తెలిపారు. బీసీల సమస్యలపై పార్టీలోని బలహీన వర్గాల నేతలను వర్కింగ్ గ్రూపులుగా విభజించి బీసీల సమస్యలు, వాటి పరిష్కారాలు, ప్రత్యక్ష పోరాటాల కోసం పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన సలహాలు సూచనలు ఇస్తామన్నారు.

లోకం పోకడ

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	35.7°c	19.2°c
ఆదిలాబాద్	35.1°c	21.7°c
మెదక్	34.3°c	19.2°c
ఖమ్మం	34.0°c	23.0°c
హైదరాబాద్	32.8°c	23.0°c
నల్లగొండ	32.5°c	24.8°c
మహబూబ్‌నగర్	32.3°c	21.4°c
నిజామాబాద్	32.3°c	23.4°c
వరంగల్	32.0°c	23.0°c
కరీంనగర్	32.0°c	24.0°c

ఆ పాలమూరు బిడ్డకు గుర్తుచేయరూ..!

వట్టెం ఎత్తిపోతల పంపులు నీళ్లలో ఉన్నా సీఎంకు పట్టదా? • ఢిల్లీ పెద్దల మనసు గెలిచే పనిలోనే బిజీబిజీ.. కేటీఆర్ ఎద్దేవా

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): 'వట్టెం ఎత్తిపోతల పంపులు నీట మునిగాయనే విషయాన్ని పాలమూరు బిడ్డకు ఎవరన్నా గుర్తుచేయండి' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కంప్యూటర్ పునరావిష్కరణ.. పెద్దలను ప్రసన్నం చేసుకోవటానికి ఢిల్లీకి చక్కర్లు.. అంటూ సీఎం రేవంత్‌ను దెప్పిపొడిచారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన బాహుబలి వంటి మోటర్లు నీట మునిగినా పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. 18 మీటర్ల లోతు నీటిలో మునిగిన పంపులను తక్షణమే పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ ప్రగతిని తుడిపేయలేరు

పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ సాధించిన ప్రగతిని ఎవరూ తుడిపేయలేరని కేటీఆర్ స్పష్టంచేశారు. కేసీఆర్ హయాంలో పదేండ్ల పాటు అప్రతిహతంగా సాగిన ప్రగతిని ఎవరూ కాదనలేరని తేల్చిచెప్పారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి విడుదల చేసిన గణాంకాలను ఎక్స్‌వేదికగా ట్యాగ్ చేస్తూ.. కేసీఆర్ తొమ్మిదిన్నర రేండ్ల పాలనలో జాతీయ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ తలసరి ఆదాయం 94 శాతం అధికంగా ఉన్న సత్యాన్ని ఎవరూ కాదనలేరని తాజా గణాంకాలే తేల్చిచెప్తున్నాయని కేటీఆర్ ఉదహరించారు.

దళితులకు మంత్రి జూపల్లి క్షమాపణలు చెప్పాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దళితులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో గురుకుల పాఠశాల భవనం కోసం భూమిని ఎంపిక చేయడంతో న్యాయం చేయాలని అడిగిన దళితులను సెక్యూరిటీ పెట్టి అడ్డగించిన మంత్రి జూపల్లి నిర్వాకంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'దళితులపై మంత్రి జూపల్లి చిర్రుబుర్రు' కథనానికి ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. అన్యాయం జరుగుతున్నదని, న్యాయం చేయండని వచ్చిన దళితులపై ఇంత కర్కశత్వమా? అని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు. దళిత బిడ్డలు మీ భూములివ్వమని అడగలేదని, వారికి గతంలో ఇచ్చిన భూములను తీసుకోకుండా న్యాయం చేయాలని అడిగారని పేర్కొన్నారు. అంతమాత్రాన తీవ్రస్వరంతో గద్దిస్తూ సెక్యూరిటీని పెట్టి బాధిత దళితులను బయటకు పంపిస్తారా? ఇందిరమ్మ రాజ్యం లో దళితులకు న్యాయం చేయరా? అని ప్రశ్నించారు. అణిచివేత ఎక్కువైతే తిరుగుబాటు మొదలవుతుందన్న సహజ సూత్రాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు.

స్కూళ్లకు గ్రాంట్స్ విడుదల

రాష్ట్రంలోని 26,387 బడులకు 48.86 కోట్లు

'చాక్‌పీస్‌లకు డబ్బుల్లేవ్.!' కథనానికి స్పందన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 18: ప్రభుత్వ పాఠశాలలకు మొదటి విడత నిర్వహణ నిధులను సర్కారు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 26,387 స్కూల్స్‌కుగానూ రూ.48.86 కోట్లు బుధవారం రిలీజ్ అయ్యాయి. ఈ నిధులను వసతుల కల్పన, క్రీడలకు వినియోగించనున్నారు. బడులు తెరుచుకొని మూడు నెలలైనా నిధులు లేవంటూ 18వ తేదీన (బుధవారం) 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'చాక్‌పీస్‌లకు డబ్బుల్లేవ్.!' కథనానికి ప్రభుత్వం స్పందించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, సామాజిక వర్గం ప్రాతిపదికన గ్రాంట్లు కేటాయించింది. ఉపాధ్యాయుల ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడంతోపాటు నిధులు విడుదలకు కృషి చేసిన 'నమస్తేతెలంగాణ'కు ఉపాధ్యాయ లోకం కృతజ్ఞతలు తెలిపింది.

నమస్తే ఎఫెక్ట్

కొత్త చట్టాలపై వినోద్ న్యాయపోరాటం

- సుప్రీంకోర్టులో మాజీ ఎంపీ పిటిషన్
- విచారణకు స్వీకరించిన ధర్మాసనం
- టేబులార్ ఫార్మాట్‌లో ఇవ్వాలని సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కేంద్రం అమల్లోకి తెచ్చిన మూడు కొత్త న్యాయ చట్టాలపై మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సుప్రీం కోర్టుకు వెళ్లారు. ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం పరిశీలించి టేబులార్ ఫార్మాట్‌లో తిరిగి సమర్పించాలని సూచించింది. కొత్త నేర, న్యాయచట్టాల్లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని పిటిషన్‌లో బోయినపల్లి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద నిందితులకు ఉన్న ప్రాథమిక హక్కులకు భంగం కలిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 348 ప్రకారం అధికార ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ ఇంగ్లిష్‌లో ఉండాలి. కానీ, కొత్తచట్టాల పేర్లను హిందీలో పెట్టారు. న్యాయ సంహిత, న్యాయ సురక్ష సంహిత, సాక్ష్య అధినియమ్ అర్థాలు ఆంగ్ల నిఘంటువుల్లో లేవని, క్షేత్రస్థాయిలో ఈ చట్టాలను అమలు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలే కాబట్టి వారి సూచనలు స్వీకరించి చట్టాల్లో ఉన్న లోపాలను సరిదిద్దాలని కోరారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్లు 15, 43(3), 94, 96, 107, 185, 187, 349, 479, 118, 152, భారతీయ సాక్ష్య అధినియమ్‌లోని సెక్షన్ 23 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21, 348కి విరుద్ధంగా ఉన్నందున వాటిని కొట్టేయాలని వినోద్‌కుమార్ కోరారు.

నోట్ దిస్ పాయింట్

సుప్రీంకోర్టు ధర్మాసనానికి బోయినపల్లి సమర్పించిన పిటిషన్‌లోని అంశాల్లో కొన్ని...

- 160 మంది ప్రతిపక్షాల సభ్యులను సస్పెండ్ చేసి, పార్లమెంట్‌లో సమర్థవంతమైన చర్చ జరగకుండానే ఈ మూడు చట్టాలను ఆమోదించారని పేర్కొన్నారు.
- భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) గ్యాంగ్, మొబైల్ ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్రూప్స్ వంటి పదాలను నిర్వచించలేదు.
- మానసిక అస్వస్థత నిర్వచనంలో మెంటల్ రిటార్డేషన్ అంశాన్ని మినహాయించారు. మానసికంగా ఎదుగుదలలేని వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయవచ్చునని పేర్కొనటం అభ్యంతరకరం.
- దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతలకు ముప్పు కలిగించే దేశద్రోహ చర్యల స్థానంలో కొత్త నేరాన్ని ప్రవేశపెట్టారు.
- భారతీయ సాక్ష్య అధినియం, 2023 ప్రకారం ఎలక్ట్రానిక్ రికార్డులు ప్రాథమిక సాక్ష్యాధారాలుగా పరిగణిస్తారు. పాత చట్టంలో వీటిని సెకండరీ సాక్ష్యాలుగా పేర్కొన్నారు.
- ఎఫ్ఐఆర్ నమోదుకు 15 రోజులు, పోలీస్ కస్టడీకి 14 రోజులకు బదులు 90రోజుల దాకా అవకాశమిచ్చారు. తద్వారా బాధితుడికి అన్యాయం జరుగుతుంది.
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, బార్ అసోసియేషన్ల అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా చట్టాలను తీసుకురావటం వల్ల వీటిపై సమగ్ర చర్చ జరగలేదనే విషయాన్ని గుర్తించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.
- పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కొత్త చట్టాలను పరిశీలించి అనేక సూచనలు చేసినా కేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదన్న విషయాన్ని ఉటంకించారు.
- దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ న్యాయవాదులు, మేధావులు, సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్న ఉదంతాలను ఆయన ఉదహరించారు.

బీఆర్ఎస్ కార్యకర్త ఇంటిపై కాంగ్రెస్ దాడి

ఖమ్మంలో అర్ధరాత్రి విధ్వంసం • కాంగ్రెస్‌లోకి వెళ్లనందుకే వేధింపులు

రఘునాథపాలెం, సెప్టెంబర్ 18: కాంగ్రెస్‌లోకి రావడంలేదనే కారణంతో ఓ బీఆర్ఎస్ కార్యకర్త ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి విధ్వంసం సృష్టించారు. బాధితుడు చీటిక వినయ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా దానవాయిగూడెంనకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చీటిక వినయ్‌ను తమ పార్టీలో చేరాలంటూ కాంగ్రెస్ నాయకులు ఆరు నెలలుగా ఒత్తిడి చేస్తున్నారు. అతడు నిరాకరించడంతో అక్రమ కేసులు పెడుతున్నారు. కాలనీలోని వినాయక మండపం వద్ద సోమవారం కొందరు యువకులు దాడులు చేసుకున్నారు. అయితే వినయ్ ప్రమేయంతోనే దాడులు జరిగినట్టు మంగళవారం ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో కొందరు తప్పుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు పిలవడంతో వినయ్ మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరనే విషయాన్ని తెలుసుకున్న అదే కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు కృష్ణ, సందీప్, ఈశ్వర్, సైదులు వినయ్ ఇంట్లోకి చొరబడి వస్తువులు, కిచెన్ సామగ్రిని ధ్వంసం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినయ్ ఫిర్యాదు చేస్తే సీఐ ఫిర్యాదు తీసుకోలేదు. పైగా ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ఓ ఖాళీ కాగితం తీసుకొచ్చి వినయ్‌తో బలవంతంగా సంతకం తీసుకున్నాడు.

బీఆర్ఎస్ కార్యకర్త వినయ్ ఇంట్లో కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన వస్తువులు, ఫర్నీచర్. (ఇన్‌సెట్) వినయ్

పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

చిల్పూరు, సెప్టెంబర్ 18: జనగామ జిల్లా చిల్పూరు మండలం కొండాపూర్‌లో విద్యుత్తు సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేసి బిగించారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'కరెంట్ లేక ఎండుతున్న పొలాలు' కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. 40 ఎకరాల్లో వరి, 15 ఎకరాల్లో మక్క పంట ఎండిపోయిందని రైతులు ఆందోళన చెందగా నమస్తే తెలంగాణ వెలుగులోకి తేగా, వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ గడ్డం గణేశ్, ఏడీ వంశీకృష్ణ, ఏఈ రమేశ్, సబ్‌ఇంజినీర్ వినీత్‌రెడ్డి, లైన్‌ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, చంద్రశేఖర్, రైతులు వెలిశాల రవీందర్, మారబోయిన యాదగిరి, చొక్కం రాజు, వెలిశాల రాజయ్య, కూరపాటి రమేశ్, కుంచం రాజు, వెలిశాల అనిల్, చొక్కం మల్లేశ్, జోడుముంతల బుచ్చిరాములు, మారబోయిన సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసం మంత్రి ఉత్తమ్ కక్కుర్తి

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నడిగూడెం, సెప్టెంబర్ 18: కమీషన్ల కోసం కక్కుర్తి పడి టెండర్ల పేరుతో కాలయాపన చేస్తూ సాగర్ ఎడమ క్వాలకు పడిన గండిని పూడ్చడంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలో ఎండిపోయిన వరి పైర్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ కాగితపు రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండి పడి సుమారు 500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. గండి పూడ్చకపోవడంతో సాగునీరు లేక 50వేల ఎకరాల్లో వరి ఎండిపోతున్నదని తెలిపారు. ఎండిపోతున్న పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ఆఫీసు కూల్చివేతపై 'సుప్రీం'కు వెళ్తాం

నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ, సెప్టెంబర్ 18: బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా ఆఫీసును కూల్చాలన్న లక్ష్యంగా కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ఆఫీసును కూల్చేయాలన్న హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తామని పేర్కొన్నారు. దీనిపై వెంటనే అప్పీల్‌కు వెళ్తామని, అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తామే తప్ప కూల్చుతుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ ఆఫీసుకూ అనుమతి లేదన్న ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చడాలు గాక నిలబెట్టడం నేర్చుకోవాలని బుధవారం ఓ ప్రకటనలో హితవుపలికారు.

ఫార్మా రైతులకు హైకోర్టు నోటీసులు

- ఫార్మాసిటీకి భూములు ఎందుకివ్వడం లేదని ప్రశ్న
- నష్టపరిహారం తీసుకోకపోవడంపై వివరణ ఇవ్వాలని ఆదేశం

హైకోర్టు జారీ చేసిన నోటీసులను బుధవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నానక్‌నగర్ గ్రామ పంచాయతీ వద్ద చూపిస్తున్న రైతులు

యాచారం, సెప్టెంబర్ 18: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నానక్‌నగర్‌కు చెందిన కొంత మంది రైతులకు బుధవారం హైకోర్టు నోటీసులు అందజేసింది. ఫార్మాసిటీకి భూములు ఎందుకు ఇవ్వడం లేదని, పరిహారం ఎందుకు తీసుకోవడం లేదని, అసలు తమ అభ్యంతరం ఏమిటో వెంటనే తెలియజేయాలని ఆ నోటీసులలో పేర్కొన్నది. ఈ నెల 27న వ్యక్తిగతంగా కాని, న్యాయవాదితో గాని హైకోర్టులో రైతులు తమ వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టంచేసింది. దీంతో రైతులు ప్రభుత్వం పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మూడు రోజుల క్రితం మేడిపల్లికి చెందిన 72 మంది రైతులకు కోర్టు నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. తాజాగా నానక్‌నగర్‌కు చెందిన రైతులకు నోటీసులు జారీ చేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. బాధిత రైతులందరూ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. ఏదేమైనా ఫార్మాసిటీకి భూములిచ్చేది లేదని స్పష్టంచేశారు. కోర్టు నుంచి నోటీసులు రావడంతో రైతులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎన్నికల ముందు ప్రస్తుత మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఫార్మా గ్రామాలలో పర్యటించి, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాను రద్దు చేస్తామని, రైతుల భూములు రైతులకే ఉంటాయని ప్రగల్భాలు పలికి.. నేడు గద్దెనెక్కి రైతులను పూర్తిగా విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీ గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు మరో ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్టు తెలిపారు. ఫార్మాసిటీకి మొత్తం 19,333 ఎకరాల భూసేకరణలో మండలంలో 9,851 ఎకరాలకు గానూ 7,640 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమిని సేకరించిన విషయం తెలిసిందే. మొదట్లో అసైన్డ్ భూమి ఎకరాకు రూ.7 లక్షలు, పట్టాకు రూ.12.5 లక్షలు ఇచ్చి, తరువాత రైతుల డిమాండ్ మేరకు అసైన్డ్ భూమికి ఎకరాకు రూ.7.70 లక్షలు, పట్టాకు రూ.16 లక్షల పరిహారం అందజేశారు. కొంత మంది భూములిచ్చి పరిహారం తీసుకోగా.. మరి కొంత మంది భూములిచ్చేదిలేదని పరిహారం తీసుకోలేదు. రైతులు తమ అభిప్రాయం చెప్పాలని హైకోర్టు పిలుపునివ్వడంతో మరోసారి కోర్టుకు వెళ్లనున్నట్టు అన్నదాతలు తెలిపారు.

స్టాల్స్‌లో వెదురు వస్తువులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కులవృత్తులకు ప్రాధాన్యత కల్పించాం

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 18: కేసీఆర్ ప్రభుత్వంలో కులవృత్తులకు అత్యంత ప్రాధాన్యత కల్పించి.. అండగా నిలిచామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ చౌరస్తాలో మేదరి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, ఏఎం